సాక్షి
అనకాపల్లి
గురువారం । 22 । ఆగస్టు । 2024



ఎసైన్షియా కంపెనీ వద్ద గుమిగూడిన జనం


పొగలు వ్యాపించిన ఫ్యాక్టరీ భవనం


ఒళ్లంతా గాయాలు


భీతావహ స్థితిలో క్షతగాత్రుడు


తలకు, కళ్లకు గాయాలైన కార్మికుడు


స్ట్రెచర్‌పై క్షతగాత్రుడిని తీసుకెళ్తున్న దృశ్యం


విషాదవదనాలతో క్షతగాత్రుల కుటుంబ సభ్యులు

కాటేసిన కార్ఖానా

కుప్పకూలిన శిథిలాల్లో నలిగిన ప్రాణాలు...
ఎగసిపడుతున్న మంటలు...పొగచూరిన పరిసరాలు
శ్వాస ఆడక.. మాట రాక.. పగిలిన గుండెలు
రసాయన మంటల్లో మసైపోయిన బతుకులు...
తునాతునకలైన దేహాలు...

రక్తాన్ని చెమటగా మార్చే కష్టజీవులు..
యంత్రాలకు చెట్లకు వేలాడే నెత్తుటి ముద్దలై...
అక్కడంతా బీభత్సం...మాటలకందని విషాదం..
ఎవరిది కాలో...ఎవరిది చేయో...తెలియని హృదయ విదారక స్థితిలో..
ముక్కలైన దేహాలను మూటకట్టి విసిరేసిన దుర్మార్గం..

తమ వాళ్లకేమైందో...జాడ తెలియక...బతికున్నారో లేదో అంటూ
లబలబలాడిన గుండెలతో పరిశ్రమ గేటు వద్దకు
పరుగులు తీసిన వారికి సమాధానం చెప్పే నాథుడు లేక...
అంతులేని నిర్లక్ష్యానికి, అనంత శోకానికి నిదర్శనంగా..
సెజ్‌లోని ఎసైన్షియా పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదం
పెను విషాదం నింపింది. జిల్లాలో ప్రకంపనలు రేపింది..


గాయపడ్డ ఉద్యోగి


తమవారి ఆచూకీ లేక విలపిస్తున్న మహిళ

సంఘటనల క్రమం

దుర్ఘటన సమయం మధ్యాహ్నం 2.25	మృతుల తరలింపు మొదలు 5.00
క్షతగాత్రుల్ని బస్సుల్లో చేర్చింది 3.00	బంధువుల ఆందోళన రాత్రి 7.00
అధికారుల రాక 3.30	కేజీహెచ్‌కు మృతదేహాల తరలింపు 11.00
అగ్నిమాపక దళం ఆపరేషన్ 4.00	హోంమంత్రి రాక 12.40

అంతా యువకులే...

ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడినవారంతా యువకులే ఉండటం విషాదకరం. వివిధ జిల్లాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చారు. నైపుణ్యం లేకపోయినా దాదాపు ఫార్మా కంపెనీల్లోనే ఎక్కువగా ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. ఈ కారణంగానే యువకులు ఎక్కువ శాతం మంది ఫార్మా పరిశ్రమల్లో చేరుతున్నారు. ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో దాదాపు 70 శాతం మంది 40 ఏళ్లలోపు యువతే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ప్రమాదంలో మృత్యు ఒడికి చేరిన వారిలో ఎక్కువ మంది 40 సంవత్సరాల్లోపు ఉన్న వారే కావడంతో అంతటా విషాద ఛాయలు అలుముకున్నాయి. వీరిలో కొందరికి వివాహం కాలేదని తెలుస్తోంది. మరికొందరికి చిన్న చిన్న పిల్లలున్నట్లు బంధువులు చెబుతున్నారు.

పగిలిన గుండెలు.. నెత్తుటి ముద్దలు...

ఎటు చూసినా మాంసపు ముద్దలే..

- ఎసైన్షియా కంపెనీలో భారీ ప్రమాదం
- పేలుడు ధాటికి చెల్లాచెదురైన కార్మికుల శరీరాలు
- 17 మంది మృతి.. శిథిలాల కింద మరో 9 మంది?
- హృదయ విదారకంగా అచ్యుతాపురం సెజ్‌లో పరిస్థితి
- సహాయక చర్యలు ఆలస్యం
- గంటన్నరైనా రాని అంబులెన్సులు
- కంపెనీ బస్సుల్లోనే క్షతగాత్రుల తరలింపు
- కేజీహెచ్‌కు మూటల్లో మృతదేహాలు

విశాఖ సిటీ/అచ్యుతాపురం/రాంబిల్లి (యలమంచిలి)/అనకాపల్లి/తుమ్మపాల: బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలు.. కొంత మంది భోజనానికి వెళ్లారు. మరికొంత మంది వారి పనుల్లో నిమగ్నమయ్యారు. ఒక్కసారిగా అణుబాంబు పేలినట్టు భారీ విస్ఫోటనం.. భూమి కంపించింది.. అచ్యుతాపురం సెజ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. 500 కిలోల సామర్థ్యం గల రియాక్టర్ పేలడంతో ఆ ధాటికి ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భవనం కుప్పకూలిపోయింది. దాని నుంచి దట్టమైన పొగ క్షణాల్లోనే కిలోమీటర్ వరకు వ్యాపించింది. ఏం జరిగిందో ఎవరికీ అంతుచిక్కలేదు. ఎసైన్షియా కంపెనీలో


క్షతగాత్రుడిని ఓదారుస్తున్న కుటుంబ సభ్యులు

రియాక్టర్ పేలడంతో ఆ ప్రాంతం శవాల దిబ్బగా మారింది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు వందల మీటర్ల వరకు చెల్లాచెదురయ్యాయి. చెట్లపైకి కాళ్లు, చేతులు ఎగిరిపడ్డాయి. మూడో అంతస్తులో రియాక్టర్ పేలడంతో ఆ భవనం నేలమట్టమైంది. కింద అంతస్తులో ఉన్న కార్మికులపై శ్లాబ్ కుప్పకూలడంతో సజీవ సమాధి అయిపోయారు. కొందరి మృతదేహాలు పూర్తిగా చికితిపోయి మాంసపు ముద్దగా మారిపోయాయి. 17మంది దుర్మరణం పాలవ్వగా 40 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు పాతికేళ్ల క్రితం హెచ్‌పీసీఎల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదం తరువాత అతిపెద్ద పారిశ్రామిక విషాదంగా ఈ దుర్ఘటన నిలవనుంది.

కొంత ఆలస్యంగా సహాయక చర్యలు

అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న సెజ్.. పేలుడు ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల కంపెనీల్లో పనిచేసే కార్మికులు భయంతో పరుగులు పెట్టారు. సుమారు 15 నిమిషాల వరకు ఎసైన్షియా కంపెనీ వైపు వెళ్లడానికే భయపడిపోయారు. ఈ క్రమంలో


ఫ్యాక్టరీ ముందు కార్మికులు, బంధువులు, స్థానికులు


మృతదేహాల తరలింపును అడ్డుకుంటున్న బంధువులు

కెమి‘కిల్’ పరిశ్రమలో కాలిన బతుకులు

ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల పరిస్థితి దారుణంగా మారింది. అధికారులు రావడానికి కూడా 30 నిమిషాలకు పైగా సమయం పట్టింది. అప్పటి వరకు కనీసం ప్రమాదంలో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసుకువచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ముందుగా స్థానిక అధికారులతో పాటు అగ్ని మాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుంది. ఒకవైపు మంటలను అదుపు చేస్తూనే.. మరోవైపు భవనంపై చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. మూడో అంతస్తులో చిక్కుకున్న కార్మికులను క్రేన్ సాయంతో కిందకు దించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకోవడంతో సహాయక చర్యలకు ఎక్కువగా సమయం పట్టింది.

మిన్నంటిన రోదనలు

కొద్ది నిమిషాలకు అన్ని శాఖల అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. అయితే పేలుడు ధాటికి భవన శకలాలు, ఇతర సామగ్రి ఎగిరి అక్కడ పనిచేస్తున్న కార్మికులకు బలంగా తగలడంతో అనేక మంది గాయపడ్డారు. అలాగే పేలుడు కారణంగా వెలువడిన రసాయనాలు పడి కొందరు క్షతగాత్రులయ్యారు. వీరందరినీ సహాయక బృందాలు బయటకు తీసుకువచ్చాయి. అయితే క్షతగాత్రుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో కార్మికులకు గాయాలవడంతో వారిని అక్కడి నుంచి తరలించడానికి అధిక సమయం పట్టింది. దీంతో వారు ఆ గాయాల నొప్పిని భరించలేక చేసిన రోదనలు మిన్నంటాయి.

అంబులెన్సులు లేకపోవడంతో..

ప్రమాదం జరిగిన గంటన్నర అయినా అంబులెన్సులు సంఘటన స్థలానికి చేరుకోకపోవడం గమనార్హం. దీంతో క్షతగాత్రులను కంపెనీ బస్సుల్లోనే ఆస్పత్రులకు తరలించారు. ఆ తరువాత రెండు అంబులెన్సులు వచ్చినప్పటికీ.. అవి సరిపోలేక అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడి నుంచి 30, 40 కిలో మీటర్ల మేర ఆ నొప్పితోనే ప్రయాణించాల్సి వచ్చింది.


రక్తసిక్తంగా ఘటనా స్థలం

మృతులు, క్షతగాత్రుల్లో ఉత్తరాంధ్రవారే ఎక్కువ

ఈ ప్రమాదంలో 17 మంది కార్మికులు మృత్యువాత పడ్డారు. వీరిలో భవనం శ్లాబ్ పడి చనిపోయిన వారే ఎక్కువగా ఉన్నారు. శిథిలాల కింద మరో 9 మంది వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొంతమంది మృతదేహాలు గుర్తించలేని పరిస్థితిలో ఉన్నాయి. సంఘటనా స్థలం నుంచి మృతదేహాలను బయటకు తీయడానికి సహాయ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అనేక మంది శరీర భాగాలు ఎగిరిపడడంతో వాటిని ఏరుకోవాల్సి వచ్చింది. కొన్ని ఏకంగా ఛిద్రమై మాంసపు ముద్దలా మారిపోయాయి. వాటన్నింటినీ మూటల్లో చుట్టి ఉంచారు. మృతుల్లో ఎక్కువ మంది ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారుగా తెలుస్తోంది.

కేజీహెచ్‌కు మాంసపు ముద్దలు

ఘటనా స్థలం నుంచి 13 మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. ఇందులో మాంసపు ముద్దలే వచ్చాయి. ఎవరి కాలు, ఎవరి చేయి, ఎవరిది శరీరమో గుర్తించలేని పరిస్థితి ఉంది. శరీర భాగాలను మూటలు కట్టుకొని తీసుకువచ్చారు. హృదయ విదారకరమైన ఈ సంఘటన చూసిన వారంతా చలించిపోయారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

సాక్షి, విశాఖపట్నం: ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాద బాధితులను పరామర్శించేందుకు సీఎం చంద్రబాబునాయుడు గురువారం విశాఖ రానున్నారు. ఉదయం 10.50 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోస్టల్ బ్యాటరీకి రానున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో మెడికవర్ హాస్పిటల్‌కు చేరుకొని అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్ని పరామర్శించనున్నారు. అనంతరం కోస్టల్ బ్యాటరీకి చేరుకొని హెలికాప్టర్‌లో అచ్యుతాపురం సెజ్‌కి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించనున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుకొని మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ తిరుగు ప్రయాణం కానున్నారు.

మృతుల పేర్లు

1. నీలపు రామిరెడ్డి (49) అసోసియేట్ జనరల్ మేనేజర్/అసోసియేట్ డైరెక్టర్, కొత్త వెంకోజీపాలెం, విశాఖపట్నం
2. హంస ప్రశాంత్ (34) సీనియర్ ఎగ్జిక్యూటివ్, పొందూరు, శ్రీకాకుళం జిల్లా
3. మహంతి నారాయణరావు (34) అసిస్టెంట్ మేనేజర్/టీమ్ లీడర్, అర్తమూరు, గరివిడి, విజయనగరం జిల్లా
4. కొప్పర్తి గణేష్‌కుమార్ (33), సీనియర్ ఎగ్జిక్యూటివ్, జువ్వలదొడ్డి, బిక్కవోలు, తూర్పుగోదావరి జిల్లా
5. చల్లపల్లి హారిక (22), ట్రైనీ ఇంజినీర్, రమణయ్యపేట, కాకినాడ
6. పైడి రాజశేఖర్ (23) ట్రైనీ ప్రాసెస్ ఇంజినీర్, వంజంగి, ఆముదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా
7. మారిశెట్టి సతీష్ (31) సీనియర్ ఎగ్జిక్యూటివ్, పాసర్లపూడి, తూర్పుగోదావరి జిల్లా
8. మొండి నాగబాబు (36), అసిస్టెంట్ మేనేజర్, సామర్లకోట
9. నాగేశ్వర రామచంద్రరావు (47), అసిస్టెంట్ మేనేజర్/టీమ్ లీడర్, కూర్మన్నపాలెం, విశాఖ
10. వేగి సన్యాసినాయుడు (53) హౌస్ కీపింగ్ బాయ్, అనకాపల్లి
11. ఎల్లబిల్లి చిన్నారావు (27) పెయింటర్, అచ్యుతాపురం, అనకాపల్లి
12. జవ్వాది పార్థసారథి (27) ఫిట్టర్, పార్వతీపురం,
13. పూడి మోహన్‌దుర్గా ప్రసాద్, హౌస్ కీపింగ్ బాయ్ అచ్యుతాపురం
14. జె.చిరంజీవి (25) ఫిట్టర్, ఎస్.రాయవరం, దార్లపూడి
15. బమ్మిడి ఆనందరావు (35), అసిస్టెంట్ మేనేజర్, విజయనగరం, పూసపాటిరేగ
16. మర్ని సురేంద్ర (37), అసిస్టెంట్ మేనేజర్, ఖమ్మం జిల్లా, అశ్వారావుపేట
17. పి.వెంకటసాయి(28), సీనియర్ ఎగ్జిక్యూటివ్, అడ్డురోడ్డు, ఎస్.రాయవరం, అనకాపల్లి జిల్లా

మెట్లు ఎక్కుతుండగా ప్రమాదం



రెండో షిఫ్ట్ డ్యూటీలో చేరేందుకు కంపెనీ మెట్లు ఎక్కుతున్నా. అదే సమయంలో ఢాం అని సౌండ్ వచ్చింది. బిల్డింగ్ ఊగిపోయింది. దీంతో నేను కూడా తూలి కింద పడిపోయాను. నా మీద నుంచి రాళ్లు, శ్లాబ్ పెచ్చులు వెళ్లాయి.

– బి.సూరిబాబు, వై.లోవ, రాంబిల్లి

చుట్టూ చెల్లాచెదురు



ఏడాదిగా పనిచేస్తున్నా. నేనుండేది ఇక్కడే సెజ్ కాలనీలో. ఈ రోజు మధ్యాహ్నం డ్యూటీకి వచ్చిన అరగంటలోనే ఈ ప్రమాదం జరిగింది. భయంకరమైన సౌండ్ వచ్చింది. చుట్టూ అంతా చెల్లాచెదురైంది. నా చేతికి, ముఖంపై గాయాలయ్యాయి. భయంతో తోచిన వైపు పరుగులు తీశా.

– జె.వర్ధన్, హెల్పర్

ఎవరూ పట్టించుకోవట్లేదు



మాది గాజువాకలోని శ్రీనగర్. బి షిఫ్ట్ విధుల్లోకి వచ్చా. ఆఫీస్‌కు వచ్చిన వెంటనే ప్రమాదం జరిగింది. చేతికి గాజు పెంకులు గుచ్చుకున్నాయి. ఆస్పత్రిలో చేర్చి గంటలు గడిచినా ఒక్క డాక్టరూ వచ్చి చూడలేదు. అడిగినా ఎవరూ పట్టించుకోవట్లేదు.

– సీహెచ్ బంగారునాయుడు, కెమిస్ట్

ఇక్కడ చేరి రెండు నెలలే..



ఉద్యోగం కోసం శ్రీకాకుళం నుంచి 2 నెలల క్రితం రాంబిల్లి వచ్చాను. కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నా. మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. వెనక్కి తిరిగి చూసేసరికి ఏమీ కనిపించలేదు. అంతా పొగతో, మంటల్లో కాలిపోతోంది. నాకు ముఖం, చేతిపైన కాలిపోయింది.

– కె.రాంబాబు, క్షతగాత్రుడు

కేజీహెచ్‌కు మృతదేహాలు


మృతదేహాలను మూటకట్టి తీసుకువస్తున్న సిబ్బంది


అంబులెన్సులో మృతదేహాల తరలింపు


కేజీహెచ్‌లో పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ): ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో మరణించిన 13 మంది ఉద్యోగుల మృతదేహాలను బుధవారం రాత్రి కేజీహెచ్‌కు మార్చురీకి తీసుకొచ్చారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సీతమ్మధార తహసీల్దార్ రమేష్ స్వయంగా పర్యవేక్షించారు. పలువురు క్షతగాత్రులను సెవెన్ హిల్స్, మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.

కేజీహెచ్‌కు తీసుకొచ్చిన మృతదేహాలు

సీలపు రామిరెడ్డి, మహంతి నారాయణరావు, మొండి నాగబాబు, చల్లపల్లి హారిక, మారిశెట్టి సతీష్, యళ్లబిల్లి చిన్నారావు, పైడి రాజశేఖర్, మోహనరావు, బొడ్డు నాగేశ్వర రామచంద్రరావు మృతదేహాలను తీసుకొచ్చారు. నాలుగు మృతదేహాల వివరాలు తెలియలేదు.


కేజీహెచ్‌లో మృతదేహాలు


కేజీహెచ్ మార్చురీకి చేరిన మృతదేహాలు



మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

మహారాణిపేట : తమకు న్యాయం చేయాలని మృతుల కుటుంబ సభ్యులు, వారి బంధువులు కేజీహెచ్ మార్చురీ వద్ద బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం తరఫున, యాజమాన్యం తరఫున కనీస స్పందన లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పంచనామాకు సంతకాలు పెట్టేదిలేదని భీష్మించుకుకూర్చున్నారు. సీఎం చంద్రబాబు గురువారం విశాఖ పర్యటనలో పరిహారం ప్రకటిస్తారని సంతకాలు చేయాలని అధికారులు కోరినా వారు వినలేదు. తమకు న్యాయం చేయకుండా పంచానామా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలు

ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స..

కె.చంద్రశేఖర్ (24)- బొబ్బిలి
జాగారపు వర్ధన్ (22)- జంగాలపాలెం
జి.రాజా(48)- వెంకటాపురం
బి.సూరిబాబు (50)- వై.లొవ
కె.రాంబాబు (33)- రాంబిల్లి
కిరణ్ సత్యనారాయణ (37)- శ్రీనగర్
శివ వెంకట రత్నం (33)- రాంబిల్లి
డి.అప్పారావు (51)- యలమంచిలి
కె.నారాయణరావు (36)- శ్రీకాకుళం
ప్రభాత యాదవ్ (23)- వరంగల్
చందక బంగారునాయుడు (29)- విజయనగరం

పవన్ సాయి ఆస్పత్రిలో..

ఎ.ప్రమేష్ (40)- యలమంచిలి
పి.శ్రీనివాస్ (40)- టెక్కలి
ఎం. లోవ శ్రీనివాస్ (36)- విశాఖపట్నం
పి.దేముడు (31)- బోయపాలెం
పి.జగేశ్వరరావు- నక్కపల్లి
పి.జగదీష్ (36)- గాజువాక
పి.ధనంజయ్ (24)- ఒడిశా
టి.గంగాధర్ (27)- తీడ
జి.కాశీరాం (32)- నర్సీపట్నం
జి.సంతోష్ (30)- విజయనగరం
జి.సాయికుమార్ (31)- బోనంగి
జే.ప్రకాష్ (30)- వేపాడ
ఎస్.అప్పారావు (49)

ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స

కె. సత్యనారాయణ(30)
బి.మోహన్ సతీష్(29)
నోట్: మొత్తం 40 మంది క్షతగాత్రులు.. మిగతావారి పేర్లు తెలియాల్సింది...

రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలి

సీతమ్మధార : అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకూ బాధితులకు అండగా ఉంటామన్నారు.

సెజ్‌ల వద్ద ఆస్పత్రులు నిర్మించాలి

అనకాపల్లి: జిల్లాలోని అచ్యుతాపురం, రాంబిల్లి సెజ్‌ల్లో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటూ కార్మికులు మృతి చెందడం బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల శాఖ పర్యవేక్షణ లోపం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల జరిగితే కార్మికులకు తక్షణమే వైద్యసేవలందించేందుకు సెజ్‌ల వద్ద ఆస్పత్రులు నిర్మించాలని, రాంబిల్లి ఘటనలో కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన కోరారు.


ఎస్సెన్షియా ఫ్యాక్టరీ ముందు గుమిగూడిన జనం


విశాఖ కేజీహెచ్‌కు చేరిన మృతదేహం


క్షతగాత్రులను తరలిస్తున్న 108 వాహనం


సంఘటన గురించి వివరిస్తున్న దృశ్యం


సంఘటన స్థలంలో మంత్రి వంగలపూడి అనిత

రియాక్టర్ ప్రమాదంలో కాకినాడ యువతి మృతి

కాకినాడ రూరల్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టరు పేలుడు ప్రమాదంలో కాకినాడ 2వ డివిజన్ సౌజన్యనగర్‌కు చెందిన చర్లపల్లి హారిక (22) మృతి చెందడంతో కాకినాడ నగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హారిక బీటెక్ పూర్తి చేసి గత ఏడాది సెప్టెంబర్ నెలలో ట్రైనీ ఇంజినీర్‌గా ఫార్మా కంపెనీలో విధుల్లో చేరారు. ల్యాబ్‌లో పని చేస్తున్న ఆమె రియాక్టర్ పేలుడు ప్రమాదంలో చిక్కుకుని మృతి చెందారు. హారిక తండ్రి తాపీమేస్త్రిగా పనిచేస్తూ చనిపోయారు. సోదరుడు పదేళ్ల వయసులోనే ఇంటి నుంచి తప్పిపోయాడు. తల్లి అన్నపూర్ణ, నాన్నమ్మ ఆదిలక్ష్మితో ఆమె కలిసి ఉంటోంది. కాకినాడ రమణయ్యపేట 2వ డివిజన్ మున్సిపల్ స్కూల్‌లో చదువుకున్న హారిక మెరిట్ స్టూడెంట్ కావడంతో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. అక్కడ ఇంజినీరింగ్ చదివింది. కెమికల్ ఇంజినీరుగా ఫార్మా కంపెనీలో ఎంపికవ్వడంతో గత సెప్టెంబరు నుంచి ట్రైనీగా పని చేస్తోంది.

ఉదయమే ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాని లోకాలకు..

రెండు రోజుల పాటు సెలవుపై పరీక్షలు రాసేందుకు ఇంటికి వచ్చిన హారిక బుధవారం ఉదయం కాకినాడ నుంచి తిరిగి విధులకు వెళ్లింది. మధ్యాహ్నం విధుల్లో ఉండగా రియాక్టర్ పేలి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న తల్లి అన్నపూర్ణ, నాన్నమ్మ ఆదిలక్ష్మి ప్రమాద స్థలం వద్దకు వెళ్లారు. ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు సౌజన్య నగర్ చేరుకుని కన్నీరుమున్నీరు అవుతున్నారు.


కాకినాడ సౌజన్యనగర్‌లో హారిక నివాసం (ఇన్‌సెట్) ఫార్మా కంపెనీలో మృతి చెందిన చర్లపల్లి హారిక (ఫైల్)

మా వాళ్లేమయ్యారో..

రాంబిల్లి (యలమంచిలి):

ఫార్మా సెజ్‌లో బుధవారం జరిగిన ప్రమాదంలో కొందరి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. దీంతో కంపెనీ వద్ద కార్మికుల బంధువులు ఆందోళనకు దిగారు. తమ వారి వివరాలు చెప్పాలంటూ పోలీసులను, కంపెనీ ప్రతినిధులను, అధికారులను అడుగుతున్నా కనీస స్పందన లేదని వాపోతున్నారు. అసలు తమవాళ్లు బతికే ఉన్నారో.. చనిపోయారో.. తెలియక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కంపెనీలో లోపల ఉన్న అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక, డీఐజీ గోపీనాథ్ జెట్టీలు బయటకు వెళ్లకుండా మెయిన్ గేట్ వద్ద బైఠాయించారు. బంధువులంతా తమవారి జాడ చెప్పాలంటూ పదేపదే అడుగుతూ ఆకలి దప్పులు మరిచి అక్కడే కూర్చున్నారు. కంపెనీ వెనుక గేట్ నుంచి మృతదేహాలను రహస్యంగా తరలిస్తున్నారని తెలియడంతో ఆ గేట్ వద్ద కూడా కొందరు బంధువులు బైఠాయించారు.

ఫార్మా ప్రమాదం బాధాకరం

– జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: రాంబిల్లి మండలంలోని అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదం చాలా బాధాకరమైన విషయమని, దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తామని కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2:15 గంటలకు రియాక్టర్ పేలడం వల్ల అగ్ని ప్రమాదం సంభవించిందన్నారు. ఫ్యాక్టరీ రెండు షిఫ్టులలో 381 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, భోజన విరామ సమయంలో పేలుడు సంభవించడం వల్ల ఉద్యోగుల హాజరు తక్కువగా ఉందన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని ఆస్పత్రుల్లో చేర్పి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న అగ్నిమాపక బృందాలు 6 ఫైర్ టెండర్లను ఉపయోగించి సంఘటన స్థలంలో రెస్క్యూ కార్యకలాపాలు చేపట్టాయన్నారు. 2019 ఏప్రిల్‌లో రూ.200 కోట్లతో స్థాపించిన ఈ ఫ్యాక్టరీలో ఇంటర్మీడియట్ రసాయనాలు, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ పదార్థాలు(ఏపీఐ) తయారు చేస్తారని తెలిపారు.


రెస్క్యూ ఆపరేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ఆస్పత్రి నుంచి 20 మంది విద్యార్థుల డిశ్చార్జ్

నర్సీపట్నం: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది విద్యార్థుల్లో 20 మంది విద్యార్థులను బుధవారం డిశ్చార్జ్ చేశారు. కోలుకున్న గిరిజన విద్యార్థులు వారి ఇళ్లకు వెళ్లేందుకు ప్రత్యేక అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలకు ఆర్డీవో హెచ్.వి.జయరాం రూ.5 వేల నగదు, నిత్యావసర వస్తువులు రైసు బ్యాగు, కందిపప్పు, మందులు తదితర సామగ్రిని అందజేశారు. సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారులు ఇంటికి వెళ్తున్నారని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి తెలిపారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తామని ఆమె తెలిపారు. సరుకులు అందజేసిన వారులో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణిదేవి, కోటవురట్ల తహసీల్దార్ జానికమ్మ, డీటీ అన్నాజీ రావు తదితరులు ఉన్నారు.


బాధిత విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న ఆర్డీవో హెచ్.వి.జయరాం

ప్రసూతి మరణాలు జరగకుండా పటిష్ట చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి: జిల్లాలో ప్రసూతి మరణాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ వైద్యాధికారులను ఆదేశించారు. మాతాశిశువు మరణాలపై తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 2023 నుంచి జూన్ 2024 వరకు జరిగిన 13 ప్రసూతి మరణాల వివరాలను ఆమె తెలుసుకున్నారు. రక్తపోటు, రక్తహీనత వంటి సాధారణ పరీక్షలతో పాటు ప్రసవానికి వచ్చిన ప్రతి గర్భిణికి జ్వర పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఏ కారణాలతో ఎక్కువగా గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో గుర్తించాలని చెప్పారు. రక్తహీనత, గర్భస్థ సమస్యలపై స్త్రీలకు అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. సమస్యలు ఎదుర్కొంటున్న గర్భిణుల విషయంలో తగిన వైద్యం అందిస్తూ వారి కుటుంబ సభ్యులకు కూడా పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య సలహాలను తెలియజేస్తూ తప్పక పాటించే విధంగా అవసరమైతే వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించాలన్నారు. ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్న గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కాలయాపన చేయకుండా సకాలంలో ఉత్తమ వైద్యం అందేందుకు దగ్గరలో ఉన్న జిల్లా ఆస్పత్రులకు పంపించాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల గ్రామాల్లో పర్యటించి వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, డీఐవో డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, డీపీఎంవో డాక్టర్ లూసి కార్డిల్యా, డీపీహెచ్ఎన్‌వో నాగమణి, జిల్లాలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీల డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ సర్వేలో అర్హులకు అన్యాయం

- భూముల స్వాధీనానికి ప్రభుత్వం యత్నాలు
- చందనాడ సర్పంచ్,ఎంపీటీసీ ఆరోపణ
- భూముల జోలికి రానివ్వమని హెచ్చరిక

నక్కపల్లి: విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఏపీఐఐసీ అధికారులు సేకరించిన భూములకు సంబంధించి అధికారులు చేస్తున్న సర్వేలో అర్హులకు అన్యాయం జరుగుతోందని చందనాడ సర్పంచ్ తళ్ల రోహిణీ భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు ఆరోపించారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్‌కోసం 2009లో నోటిఫికేషన్ ఇచ్చిందని, 2010నుంచి భూసేకరణ ప్రక్రియ ప్రారంభించిందన్నారు. చందనాడ, రాజయ్యపేట, అమలాపురం, వేంపాడు, డీఎల్‌పురం గ్రామాల్లో రైతులు స్వచ్ఛందంగా 5 వేల ఎకరాలు ఇచ్చారన్నారు. రైతుల నుంచి సేకరించిన భూములకు 2016లో టీడీపీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని చెప్పారు. అప్పట్లో నష్టపరిహారంతోపాటు ఇళ్లకు, పశువుల పాకలు, షెడ్లు, మేజర్లకు ప్రత్యేకంగా ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతులంతా భూములు ఇచ్చారన్నారు. అయితే నష్టపరిహారం మాత్రమే చెల్లించి ఆర్‌అండ్ ఆర్‌ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నిస్తోందని, సర్వే బృందాలను పంపించి సర్వేచేయిస్తోందని తెలిపారు. గతంలో సర్వే చేసి, పరిహారం చెల్లించిన వారి భూములనే మళ్లీ కొత్తగా సర్వే చేస్తున్నారని, గతంలో నష్టపరిహారం చెల్లించని సాగుదార్లు, డీఫారం పట్టాలు కలిగిన కొంతమంది అర్హుల భూములను సర్వేచేయడం లేదన్నారు. వీరంతా గత పదేళ్లనుంచి అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నారని, అయినా పట్టించుకోలేదని చెప్పారు. చందనాడలో దళితులు ఏర్పాటుచేసుకున్న గుల్లబట్టీలకు పరిహారం చెల్లించలేదని తెలిపారు. సర్వే నంబర్లు 120,135,136,137,138,65లలో సాగులో ఉన్న కొంతమందికి పరిహారం చెల్లించి, మిగిలిన వారికి పరిహారం ఇవ్వలేదని చెప్పారు. పరిహారం చెల్లింపుల్లో చాలా అవకతవకలు జరిగాయని, అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. సర్వే బృందాలు పారదర్శకంగా సర్వే చేయడం లేదని ఆరోపించారు. సర్వేలో చాలా అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై త్వరలోనే భారీ స్థాయిలో ఉద్యమం చేపడతామని చెప్పారు, తాజాగా జరుగుతున్న సర్వేపై నిర్వాసితులనుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. నష్టపోయిన రైతులను పట్టించుకోకుండా ఈ ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గతంలో ప్రకటించిన విధంగా 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ప్యాకేజీ మేజర్లకు ప్రత్యేక ప్యాకేజీ, ఆర్ అండ్ ఆర్ కార్డులు జారీ చేస్తే తప్ప భూముల జోలికి రానివ్వమని తెలిపారు.


విలేకర్లతో మాట్లాడుతున్న సర్పంచ్,ఎంపీటీసీ

ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణాలపై టీడీపీ నేతల మధ్య వివాదం

- పాత టీడీపీ వర్సెస్ కొత్త టీడీపీ
- ఇరువర్గాల వాగ్వాదంతో ఉద్రిక్త పరిస్థితులు

దేవరాపల్లి: స్థానిక సంతతోటలోని ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణం టీడీపీలోని ఇరు వర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. దీంతో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పాత టీడీపీ, కొత్త టీడీపీ వర్గీయుల మధ్య బుధవారం జరిగిన ఈ వివాదం ఆధిపత్య పోరుగా మారింది. దేవరాపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 175/4లో 1.60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ స్థలంలో దేవరాపల్లి మెయిన్ రోడ్డు విస్తరణలో ఇళ్లు, షాపులు కోల్పోయిన 31 మంది నిర్వాసితులకు కోర్టు తీర్పు మేరకు ఏడాది క్రితం కొంత స్థలాన్ని కేటాయించారు. ఇళ్ల నిర్మాణానికి లేఔట్ వేస్తున్న తరుణంలో ఆ స్థలానికి ఆనుకొని ఉన్న పాత టీడీపీకి చెందిన కొందరు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్వాసితులకు ఇవ్వగా మిగిలిన 18 సెంట్ల స్థలంలో సామాజిక అవసరాలకు కేటాయించారు. సదరు స్థలంలో బుధవారం పాత టీడీపీకి చెందిన కొందరు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టడంతో కొత్తగా టీడీపీలో చేరిన వారు అడ్డుకున్నారు. సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలంలో ఇళ్లు నిర్మించడం తగదని, ఒక వేళ అలా ఇళ్లు నిర్మిస్తే తాము కూడా హక్కు దారులమేనని వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అధికార్లు, నిర్వాసితులతో తాము గొడవ పడి 18 సెంట్ల స్థలాన్ని సాధించుకున్నామని, అప్పట్లో మీరంతా ఏమయ్యారని పాత టీడీపీ వర్గీయులు ప్రశ్నించారు. ఈ స్థలంలో ఎట్టి పరిస్థితుల్లో ఇళ్లు నిర్మించి తీరుతామన్నారు. తమ ఇళ్ల నిర్మాణాలను ఆపాల్సి వస్తే, నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలను ముందుగా నిలిపివేయాలని పాత టీడీపీ వర్గీయులు తెగేసి చెప్పారు. నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాల్లో భారీగా అవకతవకలు జరిగాయని, అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లు కేటాయించారని, నిర్వాసితుల నుంచి పలువురు డబ్బులు వసూలు చేసినట్లు స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికార్లు స్పందించి నిర్వాసితుల ఇళ్ల నిర్మాణం, సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలంపై సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


దేవరాపల్లి సంతతోట వద్ద వాగ్వాదానికి దిగిన పాత, కొత్త టీడీపీ వర్గీయులు

మూడేళ్ల చిన్నారిపై వృద్ధుడి లైంగిక దాడి

కోటవురట్ల: హోం మంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలో ముద్దులొలికే ఓ చిన్నారిపై 70 ఏళ్ల వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిండా మూడేళ్లు కూడా లేని బాలిక భరించలేని నొప్పితో ఏడవడంతో తల్లి ఆరా తీయగా విషయం బయటపడింది. వివరాలు.. కోటవురట్ల మండలం పాములవాకలోని ఎస్సీ కాలనీకి చెందిన రెండేళ్ల 11 నెలల వయసున్న చిన్నారి బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఆటలాడుతూ పక్కింటికి వెళ్లింది. చాక్లెట్ ఇస్తానంటూ చిన్నారికి ఆశ చూపిన వృద్ధుడు కోట పాములు(70) ఇంట్లోకి తీసుకెళ్లి మర్మాంగంలో చేయి పెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. భయపడిన చిన్నారి ఏడుస్తూ ఇంటికొచ్చి అక్కడ మంటగా ఉందంటూ తల్లికి చెప్పింది. తల్లి పరిశీలించగా పాప ఒళ్లంతా మట్టి పట్టి ఉంది. చేయి వేసి చూస్తే పాప బాధతో విలవిల్లాడిపోతోంది. జరిగిన ఘటనపై కోటవురట్ల పోలీసులకు ఫిర్యాదు చేసి, వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. పాప తండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి గృహిణి. వీరిది మాడుగుల మండలం కింతలి వల్లపురం. పాప అమ్మమ్మ ఊరు పాములవాక కావడంతో జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం ఇక్కడకు వచ్చి, నివాసం ఉంటున్నారు. పక్కనే ఉన్న కోట పాములు పాపకు వరుసకు తాత అవుతాడు. అభం శుభం తెలియని చిన్నారి తమ ఇంట్లో ఏం వండుకున్నా తాతకు కూడా పెట్టు అంటూ, పట్టుకెళ్లి ఇచ్చేదని తల్లి తెలిపింది. ఎంతో ఆత్మీయంగా ఉండే పాపపై దుర్మార్గంగా ప్రవర్తించాడని విలపించింది. ఘటనపై తల్లి ఫిర్యాదుతో సంఘటనా స్థలంలో ఎస్ఐ రమణయ్య దర్యాప్తు చేశారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో పాపపై లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. విషయం తెలుసుకున్న నక్కపల్లి సీఐ అప్పన్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో పాప తల్లిని విచారించారు. ఘటనకు కారణమైన వృద్ధుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లి ఫిర్యాదుతో కోట పాములుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




పాములవాకలో స్థానికులను విచారణ చేస్తున్న ఎస్ఐ రమణయ్య, లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడు పాములు

సంక్షేమ పథకాల డబ్బులతో తాగి, బిర్యానీలు తింటున్నారు

- చోడవరం ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రజల ఆగ్రహం

బుచ్చెయ్యపేట: సంక్షేమ పథకాలకు డబ్బులిస్తే, ఏటీఎం నుంచి వాటిని డ్రా చేసి, మందు కొని, దాబాలకు వెళ్లి ఫ్యామిలీ ప్యాక్ బిర్యానీలు తింటున్నారంటూ టీడీపీకి చెందిన చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచి, మంగళవారం తొలిసారిగా మండల కేంద్రం బుచ్చెయ్యపేటకు వచ్చిన ఆయన మండల పరిషత్ మీటింగ్ హాల్లో కొత్తగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్ల అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా సంక్షేమ పథకాల డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో వేయవద్దని ఇటీవల సీఎం చంద్రబాబునాయుడుని కలిసి చెప్పినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పలు పథకాల డబ్బులతో ఎవరూ బాగుపడలేదన్నారు. డబ్బులు బ్యాంక్ ఖాతాలో పడగానే ఏటీఎంలకు వెళ్లి, విత్ డ్రా చేసి, తినడం, తాగడం చేశారన్నారు. ఇంట్లో ఆడవాళ్లు కూడా వంట చేయకుండా, ఎలాగూ బిర్యానీ కొంటున్నావు కదా.. అదేదో ఫ్యామిలీ ప్యాక్ తెస్తే అందరం కలిసి తినేద్దామని భర్తలకు చెబుతున్నారని చెప్పారు. ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన డబ్బులతో ప్రజలు ఒక్క మంచి పనీ చేయలేదని, అనవసరంగా దుస్తులు కొని, ఇతర పనులకు డబ్బులను వెచ్చించి వృథా చేశారని తెలిపారు. నాటుకోడి, మటన్, కూరగాయల ధరలు పెరిగిపోయాయని, పేదరిక నిర్మూలన జరగాలంటే ప్రతి ఒక్కరూ కష్టపడి భూముల్లో గొప్పులు తవ్వి, నీళ్లు పోసి, కాయగూరలు, నాటుకోళ్లు పెంచాలని హితోపదేశం చేశారు. గత ప్రభుత్వంలో భూముల రీ సర్వే, ఇంటింటికీ తాగునీటి కుళాయిల పనులు అస్తవ్యస్తంగా చేపట్టారని, చిన్నచిన్న రైతుల వద్ద రూ.25 వేలు, రూ.50 వేలు తీసుకుని భూ రికార్డులు మార్చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో రూపాయి అవినీతి లేకుండా భూ రికార్డులను రెవెన్యూ అధికారులతో చేయిస్తానని హామీ ఇచ్చారు. మొదటిసారి మండల కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే తమ ప్రభుత్వంలో ప్రజల కోసం చేసే మంచి పనుల గురించి చెప్పకుండా, పథకాల పేరిట డబ్బులు ఇవ్వొద్దని సీఎంకు చెప్పడం, మందు, బిర్యానీలకు డబ్బులు గతలేస్తున్నారంటూ వ్యాఖ్యానించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంటే మే నెలలో రైతు భరోసా, జూన్ నెలలో అమ్మఒడి డబ్బులు అందేవని, వీటితో వ్యవసాయ పెట్టుబడులు, పిల్లల ఫీజుల కష్టాలు ఎంతో కొంత గట్టెక్కేవని వాపోతున్నారు. పేదోళ్ల కష్టాలు ఏసీ కారుల్లో తిరిగే నాయకులకెలా తెలుస్తాయంటూ ఎమ్మెల్యే తీరును ఆక్షేపిస్తున్నారు.


బుచ్చెయ్యపేట మండల కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రశాంతంగా భారత్ బంద్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో బుధవారం భారత్ బంద్ ప్రశాంతంగా జరిగింది. దళిత సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేసి, ధర్నాలు, మానవహారాలు నిర్వహించాయి. బస్సుల రాకపోకలను స్తంభింపజేశారు. పాఠశాలలను మూసివేయించారు. పలు ప్రాంతాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు.

- సాక్షి, నెట్‌వర్క్


కొత్తకోటలో ర్యాలీ చేస్తున్న దళిత సంఘాల నాయకులు


నర్సీపట్నంలో ఆందోళన చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు


వర్గీకరణకు వ్యతిరేకంగా మునగపాక మెయిన్‌రోడ్డులో రాస్తారోకో

క్లుప్తంగా

విద్యార్థులకు హయగ్రీవ మంత్రోపదేశం



విద్యార్థులకు మంత్రోపదేశం చేస్తున్న రఘునాథాచార్య

అనకాపల్లి : మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో విద్యార్థులకు చక్కని విద్య, మంచి భవిష్యత్తు కోసం హయగ్రీవ మంత్రోపదేశం చేశారు. శ్రీ అష్టలక్ష్మీ పీఠాధిపతి రఘునాథాచార్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రతిష్ట శత జయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి : రాంబిల్లి సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ ప్రైమ్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ప్రమాదంలో కార్మికుల మృతి, పలువురు గాయపడిన ఘటన దురదృష్టకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరణించిన ఒక్కో కార్మికుని కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం చెల్లించి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సెజ్‌లో ప్రమాదాలు సంభవిస్తున్నా పొల్యూషన్‌కంట్రోల్ బోర్డ్, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఐక్యతే ముద్దు



అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘం నాయకులు

కశింకోట : ఎస్సీల వర్గీకరణ కంటే ఐక్యతే ముద్దు అని అంబేడ్కర్ ఇండియా మిషన్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలు బంద్ జరిపి, ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జై భీమ్ జిల్లా కార్యదర్శి గొంది అప్పారావు, మండల కార్యదర్శి గణేష్, దళిత సంఘ నాయకులు మహేష్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 93 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,550	5,100
రెండో రకం	3,800	4,050
మూడోరకం	3,200	3,300

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్లిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 373 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అన్నదాతలకు.. వరి నాట్ల వర్రీ

- నిరాశాజనకంగా వరి సాగు
- సరైన వర్షాలు లేక ఇబ్బందులు
- బోరు నీరే ఆధారమంటున్న రైతులు

మండలంలో ఈ ఏడాది వరి సాగు నిరాశాజనకంగా ఉంది. ఇప్పటికి 25 శాతం పైబడి మాత్రమే నాట్లు పడ్డాయి. ఆగస్టు నెలాఖరు అవుతున్నప్పటికీ సరైన వర్షాలు లేకపోవడంతో వరి సాగు ముందుకు సాగడం లేదు. దీంతో వరి సాగు ఈ ఏడాది సాధారణ విస్తీర్ణానికి చేరుకునే పరిస్థితి కానరావడం లేదు. మరో వైపు మండుతున్న ఎండలకు నాటిన నాట్లు నీరు లేక పలు చోట్ల ఎండిపోతున్నాయి. దీంతో పంట చేతికి రావడం కష్టమయ్యే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నీటి సదుపాయం ఉన్న చోట వేసిన వరి నాట్లు



కశింకోటలో ఎండను సైతం లెక్క చేయకుండా బోరు నీటితో వరి నాటుతున్న రైతు కూలీలు



కశింకోటలో ఎండుతున్న వరి నాట్లు



ఎదుగుదల లేని వరినాట్లు

కశింకోట : మండలంలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తారు. ఒకప్పుడు చెరకు సాగు ప్రథమ స్థానంలో ఉండేది. ఇది లాభదాయకంగా లేకపోవడంతో పంట తగ్గించి వరి వైపు దృష్టి సారించారు. దీంతో వరి సాగు ప్రథమ స్థానానికి చేరుకుంది. మండలంలో శారదా నది పరీవాహక ప్రాంతమైన కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్‌పేట, సోమవరం, నూతలగుంటపాలెం, నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, ఏనుగుతుని, అచ్యుతాపురం గ్రామాలతో పాటు మామిడివాక గెడ్డ, సాగునీటి చెరువులు, రంగబోలు గెడ్డ, కొండగెడ్డల ఆయకట్టు ప్రాంతాలైన గొబ్బూరు, చింతలపాలెం, అచ్చెర్ల, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెంతో పాటు విసన్నపేట, సింగవరం, జి. భీమవరం, సుందరయ్యపేట, ఆనందపురం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది వరి సాధారణ విస్తీర్ణం 909 హెక్టార్లుగా అధికారులు నిర్ణయించారు. దీనిలో నీటి సదుపాయం ఉన్న మేరకు 248 హెక్టార్లలో మాత్రమే ఇప్పటి వరకు నాట్లు వేసినట్లు అధికారిక సమాచారం. అంటే 27.28 శాతం మేర మాత్రమే నాట్లు వేశారు. మిగిలిన చోట్ల నీటి సదుపాయం లేక నాట్లు వేయని పరిస్థితి నెలకొంది. గత కొద్ది రోజులుగా సరైన వర్షాలు కురవడం లేదు. దీంతో ముమ్మరంగా నాట్లు వేయాల్సిన సమయంలో బోర్లు, నీటి సదుపాయం ఉన్నచోట మాత్రం అడపా దడపా నాట్లు వేస్తున్నారు. మిగిలిన రైతులు వర్షం కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. మండలంలో అత్యధిక శాతం మంది వర్షం ఆధారంగా పంటలు పండిస్తారు. శారదా నది నీరు, సాగు నీటి చెరువులు, రంగబోలు జలాశయం, కొండ గెడ్డల ద్వారా వచ్చే నీటితో పంటలు పండిస్తారు. ముమ్మరంగా నాట్లు వేయాల్సిన సమయంలో పరిస్థితి ఇలా ఉంటే ఖరీఫ్ వరి సాగు ఈ ఏడాది కష్టమేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే రానున్న కాలంలో వర్షం పడనుందని, ఈ మేరకు వాతావరణ శాఖ ప్రకటిస్తుందని, దీంతో ఒక్కసారిగా సాధారణ విస్తీర్ణం మేరకు నాట్లు పూర్తి కాగలవని అధికారులు అంటున్నారు. గత ఏడాది కూడా వాతావరణం అనుకూలించక సాధారణ విస్తీర్ణానికి చేరువగా 840 హెక్టార్లలో నాట్లు జరిగాయి. అంతకు ముందు ఏడాది అయితే వాతావరణం అనుకూలించడంతో 1200 హెక్టార్ల మేర నాట్లు వేశారు. అయితే ఈ ఏడాది కూడా సాధారణ విస్తీర్ణం మించగలదని అధికారులు అంటున్నారు. అయితే ఆదిలోనే హంసపాదులా గత నెలలో తుపాను వర్షాలకు వరి నారుమళ్లు మునిగిపోయి నష్టపోయే పరిస్థితి సంభవించింది. కొందరు కొత్తగా నారుమళ్లు వేసుకున్నారు. అవి ఎదుగుదల లేని స్థితి ఏర్పడింది. దీంతో గత జూలై నెలాఖరున ప్రారంభం కావల్సిన నాట్లు ఆలస్యంగా ఆగస్టులో ప్రారంభమయ్యాయి. దీనికి తోడు సరైన వర్షాలు లేక నీటి సదుపాయం లేకపోవడంతో నాట్లు వేయడం మందకొడిగా సాగుతోంది. ఇకనైనా వర్షాలు పడితే కాస్త అయినా గట్టెక్కగలమని రైతులు ఆశిస్తున్నారు. కొందరు నీరు లేక నాట్లు వేయకపోగా ఎండలు కాస్తున్నా ముమ్మందు వర్షం కురవకపోతుందా అనే ఆశతో ఏదోలా శ్రమించి బోరు నీటితో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన వరి నాట్లు మండుతున్న ఎండలకు ఎండిపోతున్నాయి. ఎదుగుదల లేని స్థితిలో కొన్ని ఉన్నాయి. దీంతో వరి సాగు రైతులు దిగులు చెందుతున్నారు.

నారుమడి ఎండిపోతోంది..



సుమారు రెండు ఎకరాల్లో వరి నాట్లు వేశాను. వర్షమే పంట సాగుకు ప్రధాన ఆధారం. అయితే బోరు నీటి సదుపాయంతో అష్టకష్టాలు పడి నాట్లు వేశాను. అది మండుతున్న ఎండలకు ఎండిపోతోంది. కొంత భాగం ఎదుగుదల లేదు. దీంతో దిగుబడి తగ్గి నష్టం ఏర్పడే పరిస్థితి ఉంది. వర్షాలు కురవకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వేలాది రూపాయల పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరు అవుతుందేమోనని దిగులుగా ఉంది. – దాడి సత్తిబాబు, రైతు, కశింకోట

వర్షాలు లేక ఇబ్బంది పడుతున్నాం..



వరి నాట్లు ఈ ఏడాది ఆలస్యం అయ్యాయి. తుపాను వర్షాలకు నారుమళ్లు నీట మునిగి ఎదుగుదల లేకపోవడంతో ఈ ఏడాది నాట్లు వేయడంలో జాప్యం జరిగింది. అష్టకష్టాలు పడి నాట్లు వేస్తే సరైన వర్షాలు కురవకపోవడం దిగులు కలిగిస్తోంది. అవసరమైన వర్షాలు కురిస్తేనే పంట ఏపుగా ఎదిగి దిగుబడి రావడానికి అవకాశం ఉంటుంది.

– పిట్టా బుజ్జి, రైతు, నూతలగుంటపాలెం, కశింకోట మండలం

సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లకు అవకాశం..

మండలంలో వరి సాధారణ విస్తీర్ణం ఈ ఏడాది 909 హెక్టార్లుగా నిర్ణయించారు. దీనిలో ఇప్పటికి 248 హెక్టార్లలో నాట్లు వేశారు. సరైన వర్షాలు లేక ఈ ఏడాది నాట్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. రానున్న కాలంలో వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ సూచనలున్నాయి. మండలంలో వచ్చే సెప్టెంబర్ 15 వరకు రైతులు నాట్లు వేయనున్నారు. దీంతో సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లు జరగగలవని భావిస్తున్నాం. గత ఏడాది సాధారణ విస్తీర్ణానికి చేరువలో నాట్లు వేశారు. వరి నాట్లలో కాలిబాటలు వేసుకుంటే సుడిదోమ నుంచి పంటను రక్షించుకోవచ్చు.

– ఎం.స్వప్న, మండల వ్యవసాయ శాఖ అధికారి, కశింకోట.

సీఐల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయకుమార్



బాధ్యతలు చేపట్టిన అల్లు స్వామి నాయుడు

అనకాపల్లి : పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా టి.వి.విజయకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం జిల్లా సైబర్ క్రైం విభాగంలో సీఐగా విధులు నిర్వర్తిస్తు సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న జి.శంకరరావు విజయనగరం జిల్లా చీపురుపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. గతంలో అనకాపల్లి డివిజన్ పరిధిలో పని చేసిన అనుభవం ఉన్నట్లు ఆయన తెలిపారు.

కశింకోట సీఐగా స్వామినాయుడు

కశింకోట : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతామని కశింకోట సీఐ అల్లు స్వామి నాయుడు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా అరికట్టడానికి సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అదుపు చేస్తామన్నారు. ఆయన ఎ.కోడూరు, ముంచంగిపుట్, మునగపాక, అనకాపల్లి ట్రాఫిక్ ఎస్ఐగా, కొయ్యూరు, రాజవొమ్మంగి సీఐగా గతంలో పని చేశారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన నాయుడుకు పోలీసు సిబ్బంది, స్థానికులు అభినందనలు తెలిపారు. పోలీస్‌స్టేషన్ స్థాయి పెంచిన తర్వాత తొలి సీఐగా ఇక్కడ పని చేసిన ఎం. వినోద్‌బాబు సమర్థవంతంగా విధులు నిర్వర్తించి పేరు తెచ్చుకుని విశాఖకు బదిలీ అయ్యారు.

వరి సాగుపై రైతులకు మెలకువలు



వెదురుపర్తి వరి పొలాల్లో రైతులతో కలిసి కాలి బాటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి స్వప్న

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి రైతులకు వరి సాగుపై పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం. స్వప్న వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వరి నాట్లు, వాటిలో కాలి బాటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వరి నాట్లు వేసిన రెండు రోజుల తర్వాత ప్రతి 2 మీటర్లకు 20 సెంటీ మీటర్ల వంతున కాలి బాటలు వేసుకోవాలన్నారు. దీనివల్ల సుడి దోమ నుంచి పంటను రక్షించుకోవడమే కాకుండా పంటకు గాలి బాగా తగిలి ఏపుగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో తూర్పు, పడమర దిశగా కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పటికీ నేరస్తులను శిక్షించకపోవటం దారుణం



నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేస్తున్న శ్రామిక మహిళా కార్మికులు

కశింకోట : మహిళలపై జరుగుతున్న అరాచకాలు, దాడులు, హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి విమర్శించారు. కశింకోటలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో బుధవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కతాలో జూనియర్ మహిళా వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన దుండగులను నేటికీ శిక్షించకపోవడం శోచనీయమన్నారు. దేశవ్యాప్తంగా ఈ ఘటనపై నిరసనలు పెల్లుబుకుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి..

అనకాపల్లి : కోల్‌కతా వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా స్థానిక సీఐటీయూ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ వరకూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలని, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు నిరోధించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి. రమణమ్మ, ఇందిర, మోహన, రామలక్ష్మి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సూర్య, రమణమ్మ, తవిటమ్మ, ఐద్వా జిల్లా నాయకురాలు గంటా సుభాషిని, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు చలపతి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల : రాంబిల్లి ఘటనలో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖ ఉమ్మడి జిల్లా కలెక్టర్‌కు, ఉన్నత స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి వద్ద విలేకరుల సమావేశంలో బుధవారం రాత్రి ఆయన మాట్లాడారు. రాంబిల్లి ఘటనలో 17 మంది మృత్యువాత పడినట్లు ఆయన తెలిపారు. అనకాపల్లి ప్రైవేట్ ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న రోగులకు కుటుంబ సభ్యులు కోరిన చోట వైద్యం అందజేస్తామన్నారు. ప్రస్తుతం ఉషాప్రైమ్ ఆస్పత్రిలో 12 మంది క్షతగాత్రులు వైద్యం పొందుతున్నారని, వైద్యుల సూచన మేరకు నలుగురిని మెరుగైన వైద్యం కోసం పంపించాలని చెప్పామని తెలిపారు. ప్రైవేట్ పరిశ్రమల్లో రక్షణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. క్షతగాత్రులను జేసీ జాహ్నవితో కలిసి పరామర్శించారు. క్షతగ్రాతుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

23న గ్రామ సభలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డివిజనల్ పీవో మంజులవాణి

కశింకోట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించాలని డివిజనల్ పంచాయతీ అధికారి మంజులవాణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో వి.వి. రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి పథకం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి పథకంలో చేపట్టనున్న పనులను గుర్తించి గ్రామ సభలో తెలపాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో సంపద కేంద్రాలు నిర్వహించి తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో శివ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 15 లోపు ఈ-క్రాప్ నమోదు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి

రోలుగుంట: వచ్చేనెల 15వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి వీఆర్వోలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీఆర్వోల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడి మహాలక్ష్మి తల్లి పండగ

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి మరిడి మహాలక్ష్మి తల్లి పండగను గురువారం నాతవరంలో ఘనంగా నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మండలంలో వల్సంపేట వై.బి.పట్నం యం.బి.పట్నం గ్రామాల్లో కూడా శ్రీమరిడిమ్మ తల్లి పండగను గ్రామస్తులు జరుపుకోనున్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. తమ కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ మండల కమిటీ శిక్షణ తరగతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు, మందులు, పేషెంట్లకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించటానికి సరైన సౌకర్యాలు లేవని, వీటి వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. అనకాపల్లిలో అనేక ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని రక్షించి ప్రజల అవసరాలకు ఉపయోగించాలనికోరారు. అనకాపల్లి- చోడవరం వయా పాడేరు వెళ్లే రహదారి గుంతల మయమై ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నూతన ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. సీపీఎం నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, బి. ఉమామహేశ్వరరావు, కె. తేలయ్యబాబు, భీశెట్టి అప్పారావు, బోడి రాజు, టి.సురేష్, డి.డి. వరలక్ష్మి, జి.సుభాషిణి, కె.ఈశ్వరరావు, బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం





కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారు, ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

అనకాపల్లి : స్థానిక కోట్ని వీధి మరిడిమాంబ అమ్మవారి పండగను ఈనెల 22న అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాలతో పాటు, వివిధ ప్రాంతాల్లో నివసించే భక్తులు ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవానికి విచ్చేసి మొక్కులు తీర్చుకుంటారు. మహోత్సవానికి సుమారు 50 వేల మంది భక్తులు రానున్నట్లు అంచనా. అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ విగ్రహం ఊరేగింపు, శ్రీ సీతారామ యాత, శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏలి ఏనుగు ఊరేగింపు, అమ్మవారి ఎత్తైన ప్రభల ఊరేగింపు, కాంతారా డ్యాన్స్, దాండియా డ్యాన్స్, ప్రత్యేక ఆకర్షణగా 12 అడుగుల అమ్మవారి బొమ్మలు, నేల వేషాలు, భీమునిగుమ్మం అంబేడ్కర్ జంక్షన్‌లో సబ్బవరపు గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో'1995 బాబు ఈజ్ బ్యాక్ ది-అల్టిమేట్ డ్యాన్స్ షో, కోట్ని వీధి రామాలయం వద్ద ఓల్డ్ ఈజ్ గోల్డ్ క్లాసికల్ డ్యాన్స్ షో, గాంధీబొమ్మ సెంటర్ వద్ద అనకాపల్లి ఎంపీ గారి తాలుకా డ్యాన్స్ నైట్ వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

ఘనంగా గౌరీపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం





గౌరీపరమేశ్వరి అమ్మవారు, గౌరీ పంచాయతన ఆలయంలో లక్ష కుంకుమార్చన చేస్తున్న దంపతులు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ గౌరీ పంచాయతన ఆలయంలో బుధవారం గౌరీపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ట (వార్షికోత్సవం) జరిగింది. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజ, ప్రత్యేక అలంకరణ వంటి కార్యక్రమాలు జరిగాయి. ఆలయ మండపంలో సామూహిక దంపతులచే లక్ష కుంకుమార్చన పూజలు జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లకు సత్కారం



చైర్మన్ సముద్రాలు, వైస్ చైర్మన్ మేరీలను సత్కరిస్తున్న సర్పంచ్ రెవెన్యూనాయుడు

అనకాపల్లి : మండలంలోని మార్టూరు గ్రామంలో ఈనెల 17న జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి కోట్ని సముద్రాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సందర్భంగా బుధవారం మార్టూరు గ్రామంలో చైర్మన్ కోట్ని సముద్రాలు, వైస్ చైర్మన్ మేరీలను గ్రామ సర్పంచ్ మార్టూరు రెవెన్యూనాయుడు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపొందిన చైర్మన్‌తో పాటు ఇతర సభ్యులు హైస్కూల్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేయాని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మిద్దె రామచంద్రరావు, గ్రామ నాయకులు ఒమ్మి మధు, స్కూల్ కమిటీ మాజీ అధ్యక్షుడు దంట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.